విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

విశాలాంధ్ర - ఏలూరు : రహదారులపై ప్రయాణిస్తున్నప్పుడు వాహన చోదకులు నియమాలు తప్పనిసరిగా పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ప్రమాదం వాటిల్లుతుందని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కె. విజయ రాజు అన్నారు. చోదిమెళ్ళలోని స్థానిక ఆర్టీవో కార్యాలయంలో గురువారం 34వ రహదారి వారోత్సవాలు జరిగాయి. ఈనెల 18 నుండి 24 వరకు ఈ వారోత్సవాలు జరుగుతాయి. ఆర్టీవో కె. శ్రీహరి సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ విజయరాజు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు విధిగా ధరించాలన్నారు. హెల్మెట్ కూడా మంచి కంపెనీది అయి ఉండాలి అన్నారు. సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ ఎప్పటికైనా ప్రమాదమని ఆయన హెచ్చరించారు. మద్యపానం సేవించి డ్రైవింగ్ చేయడం అనే దురలవాటును మానుకోవాలన్నారు. కారులో ప్రయాణించేవారు డ్రైవర్ తో సహా అందరూ సీట్ బెల్టులు ధరించాలన్నారు. ఓవర్ లోడ్ను అనుమతించరాదని ఆయన ఆటో డ్రైవర్లకు సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి. స్వామి, కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారులు కె. ధనలక్ష్మి ఎం. రాము, ఆనంద్, ఆటో యూనియన్ డ్రైవర్లు సంఘం, లారీ యూనియన్ డ్రైవర్లు సంఘం ప్రతినిధులు, ద్విచక్ర వాహనదారులు, ఆర్టీవో ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

దాళ్వా ఆశలు ఆవిరి

- నరసాపురం కెనాల్‌కు అందని నీరు
- ఎండి పోతున్న వరి చేలు
- రైతుల గగ్గోలు

విశాలాంధ్ర - పెనుమంట్ర : దాళ్వా పై రైతులు పెట్టుకున్న ఆశలు నీటి కొరతతో ఆవిరైపోతున్నాయి. వరి నాట్లు పూర్తికాకుండానే నీటి ఎద్దడి మొదలు కావడంతో డెల్టా రైతులు ఆందోళనకు గుర వుతున్నారు. నాట్లు పూర్తి అయిన చేలు ప్రస్తుతం మూన తిరిగే దశలో ఉన్నాయి. ఇలాంటి కీలక సమయంలో నీరు అందకపోతే మొక్క బతికి బట్ట కట్టడం కష్టమని రైతులు వాపోతున్నారు. పెనుమంట్ర మండలంలో ఆయకట్టుకు నీరందించే నరసాపురం కాల్వకు జనవరి మొదటి వారంలో నీరు విడుదల చేశారు. అప్పటినుంచి మళ్ళీ నీరు విడుదల చేయకపో వడంతో చేలు ఎండిపోతున్నాయి. దీనికి తోడు మెల్లమెల్లగా ఎండలు ప్రభావం పెరగడంతో కొన్నిచోట్ల చేలు నెర్రలు తీస్తున్నాయి. నాట్లు పూర్తయిన దశలో వేసిన ఎరువులు నీటి కొరత కారణంగా మొక్కలకు పూర్తిగా అందడం లేదని రైతులు వాపోతున్నారు. చేలల్లో నీరు లేకపోవడంతో ఎలుకల విజృంభణ మొదలయ్యిందని చెబుతున్నారు. మండలంలోని మార్టేరు, సత్యవరం, వెలగలేరు, భట్ల మగుటూరు, ఆలమూరు తదితర గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. ఇప్పటికే నారుమళ్ళకు, నాట్లకు వేలాది రూపాయలు ఖర్చు చేశామని, తమ పరిస్థితి అగమ్య గోచరంగా తయారయ్యిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకుని తక్షణమే నీరు సరఫరా చేయాలని కోరుతున్నారు.

డ్రగ్స్ దుష్ఫలితాలపై అవగాహనా సదస్సు

విశాలాంధ్ర భీమవరం: డ్రగ్స్ వల్ల కలిగే దుష్ఫలితాలకు సంబంధించిన అవగాహన కొరకు ప్రభుత్వంచే ఆమోదించబడ్డ బ్యానర్లు అన్ని మున్సిపాలిటీలలో, కళాశాల లో ఏర్పాటు చేసి విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి సూచించారు. గురువారం జిల్లా కలెక్టరు క్యాంపు కార్యాల యంలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో శాఖ, సంబంధిత అధికారులతో కలిసి డ్రగ్స్ రహిత సమాజం ఏర్పాటుకు తీసు కోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖలతో సమన్వయ సమావేశం జిల్లా కలెక్టరు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలలో విద్యను అభ్యసించే యువత డ్రగ్స్ బారిన పడ కుండా ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో యాజమాన్యం పర్య వేక్షణ ఉండాలని, డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే దుష్ఫలి తాలపై వారికి అవగాహన పెంచాలని ఇందుకు సంబంధించిన బ్యానర్లను పోస్టర్లు హోర్డింగులను ప్రతి కాలేజీలలో ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింటు కలెక్టరు జె వి మురళి , డిఆర్ఓ దాసి రాజు, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు, సంబంధిత శాఖల అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

రూ.1.29 లక్షలతో రహదారి నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - కలిదిండి: రూ1.29 లక్షలతో కలిదిండి, కైకలూరు ఆర్ అండ్ బి రహదారి నిర్మాణ పనులను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ప్రారంభిం చారు. గురువారం మండలంలోని వెంకటాపురం, కాళ్ల పాలెం వరకు సుమారు 2 కిలోమీటర్ల మేర ఆర్ అండ్ బి రహదారి ప్రత్యేక మరమ్మతులకు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలిదిండి నుంచి వెంకటాపురం వరకు ఆర్ అండ్ బి రహదారి రోడ్డు నిర్మాణం పనులు జరిగాయని, మిగిలిన 2 కిలోమీటర్ల ఆర్ అండ్ బి రహదారి పూర్తిస్థాయిలో త్వరలో అందుబాటులోకి తేనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బొర్రా సత్యవతి, వైస్ ఎంపీపీ కనకదుర్గారాణి, నాగలక్ష్మి, ఏఎంసి వైస్ చైర్మన్ పాము. రవికుమార్, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైసీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, మండల సర్పంచుల ఫారం అధ్యక్షులు గద్దె ఆనంద్ కుమార్, పిఏసిఎస్ అధ్యక్షులు వడ్లని పార్థసారథి, ఆర్ అండ్ బి డిఈఈ విజయ శేఖర్, కాంట్రాక్టర్ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏపూరికి సతీ వియోగం

విశాలాంధ్ర - లింగపాలెం : పుప్పాలవారిగూడెంకు చెందిన వైసీపీ నాయకుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడు ఏపూరి సూరిబాబు సతీమణి ఏపూరి చాయాదేవి(68) గురువారం తెల్లవారుజామున హఠాన్మరణం చెందారు. ఈమె కోడలు ఏపూరి సుప్రియ ప్రస్తుతం పుప్పాలవారిగూడెం సర్పంచ్‌గా ఉన్నారు. చాయాదేవి హఠాన్మరణం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. మంచి వ్యక్తిగా అందరినీ తల్లిలా ఆప్యాయతగా చూసే చాయాదేవి మృతిని స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆమె హఠాన్మరణంపై పార్టీల రహితంగా నాయకులు విచారం వ్యక్తం చేశారు. అనేక మంది మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఎంపీ మాగంటి బాబు, ఎమ్మెల్యే ఎలీజా ఫోన్‌లో సూరిబాబును పరామర్శించారు. కుటుంబ సభ్యులు, స్థానికుల మధ్య అంత్యక్రియలు జరిగాయి.

మంచినీటి బోరు పరిశీలన

విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : త్రాగునీరు కలుషితం అనే కథనానికి స్పందన! కొయ్యలగూడెం మండలం పొంగుటూరు గ్రామపంచాయతీ పరిధి కన్నాయిగూడెం గ్రామంలో త్రాగే మంచినీరు కలుషితమై బురద నీరు వస్తుందని కన్నాయిగూడెం గ్రామ ప్రజలు విశాలాంధ్ర పత్రికకు తెలుపగా, విశాలాంధ్ర పత్రికలో త్రాగునీరు కలుషితం అనే కథనం గురువారం వెలువడటంతో సంబంధిత పంచాయతీ కార్యదర్శి కె .నాగేశ్వరరావు కన్నాయిగూడెం గ్రామంలో పంచాయతీ ద్వారా సరఫరా చేసే మంచినీరు బోరు వద్దకు వెళ్లి పరిశీలించారు. బోరు మోటారు మరమ్మత్తులు చేయించి గ్రామ ప్రజలకు మంచినీరు అందజేస్తామని నాగేశ్వరరావు తెలిపారు.

రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమం

- పంటలకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలి
- 26న ఏలూరులో ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ర్యాలీ

విశాలాంధ్ర - ఏలూరు : ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతాంగాన్ని మోసగించిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. దేశ వ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఏలూరులో ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా రైతుల ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రైతు సంఘాల నాయకులు ప్రకటించారు. స్థానిక పవరు పేటలోని అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల జిల్లా సమన్వయ కమిటీ సమావేశం రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. రిపబ్లిక్ డే రైతు ట్రాక్టర్ల ర్యాలీ పోస్టర్లను రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు ఆవిష్కరించారు. సమావేశంలో బికేఎంయు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాధరావు, ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి యు.వెంకటేశ్వర రావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఆర్.లక్ష్మణరావు, నాయకులు ఉప్పులూరి హేమ శంకర్, ఏఐకేకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు డి.రంగనాథ్, రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.కె.భాషా, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన రావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నర్సింహా, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ, జిల్లా నాయకులు ఎల్లమ్మ, సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు బి. జగన్నాథం, వి.సాయి బాబా మాట్లాడారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి సి2ం50 శాతం ఫార్ములా ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ మద్దతు ధరలు రైతులకు అందేలా మద్దతు ధరల గ్యారెంటీ చట్టం వెంటనే తేవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధరలకు చట్టబద్ధత లేక రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పంటల మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించకపోవడం అన్యాయమన్నారు. దేశ వ్యాప్తంగా రైతులు వ్యవసాయ నష్టాలతో అప్పుల ఊబిలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో రైతుల ధాన్యం కొనుగోలులో వస్తున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని, రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా ఏలూరులో అల్లూరి సీతారామరాజు స్టేడియం నుండి జిల్లా కలెక్టరేట్ వరకు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో రైతులు, కార్మికులు నిర్వహిస్తున్న రైతు ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ముప్పిడి శ్రీనివాసరావు, ఉప్పు మురళీకృష్ణ, కట్టా భాస్కరరావు, ఘంటా పాపారావు, మనికె నాగేశ్వరరావు,జి.గోపి, శేషపు మహంకాళిరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ళ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలి

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించి, మౌళిక సౌకర్యాలు కల్పించాలని సీపీఐ ఏరియా కార్యదర్శి మండల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా తాడేపల్లిగూడెం కపర్ది భవనంలో పోస్టర్ ఆవిష్కరణ చేసారు. జగనన్న కాలనీల్లో సరైన రోడ్లు, విద్యుత్,నీటి సరఫరా లాంటి మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సిమెంట్, ఇసుక, స్టీల్ లాంటి భవన నిర్మాణ మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగి పోయి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.1 లక్ష80వేలు సరిపోక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రోడ్లు సరిగా లేక గృహ నిర్మాణ మెటీరియల్ తెచ్చుకోవడంలో ఇబ్బందులెదుర్కొంటున్నారన్నారు. కాలనీలకు వెళ్ళడానికి సరైన రోడ్లు నిర్మించాలని, త్రాగునీరు, విద్యుత్ లాంటి మౌళిక సదుపాయాలు కల్పించాలని, గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని, లబ్ధిదారుల ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణానికి 5 లక్షలు రూపాయలు ఇవ్వాలని, మౌళిక సదుపాయాలు కల్పించాలని, టిడ్కో ఇళ్ళ లోసరైన సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు వెంటనే స్వాధీనం చేయాలనీ సీపీఐ చేపట్టిన పోరుబాట లో కరపత్రాలను పంపిణీ చేశారు. తాడికొండ గంగ భవాని మాట్లాడుతూ జనవరీ 17 నుంచి 30 వరుకు సంతకాల సేకరణ, 30 వ తేదీన లబ్ధిదారుల తో రౌండ్ టేబుల్ సమావేశాలు, ఫిబ్రవరి 6 న కలెక్టరేట్ వద్ద ధర్నాలు జరుగుతాయని, ఫిబ్రవరి 22 న విజయవాడలో మహాధర్నా జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు అల్లం రాము, తాడికొండ గంగ భవాని , తాడికొండ యేసురాజు, వడ్డది మేరీ, బాబీ, తూము సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ళ నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలి

విశాలాంధ్ర -నూజివీడు టౌన్ : జగనన్న కాలనీలో నిర్మించే ప్రతి ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు . గురువారం సిపిఐ నాయకులు జగనన్న కాలనీలను నిర్మాణాలు,మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న కాలనీలో లబ్ధిదారులకు ఇచ్చే రూ. 1లక్ష 80 వేలు ఇంటి పునాదులు కూడా సరిపోవడంలేదని, కనీసం మూడు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఐదు సెంట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీలలో సరి అయిన రోడ్లు, మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలన్నారు .ప్రస్తుతం ఉన్న సిమెంట్, ఇసుక, ఇనుము ధరలు ఆకాశంలో అంటుతున్నాయని , ప్రభుత్వం ఇచ్చే రూ. 1లక్ష 80వేలు ఎటూ సరిపోవన్నారు . ఈ కార్యక్రమంలో సిపిఐ నూజివీడు పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అలంపురం జగనన్న కాలనీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

విశాలాంధ్ర - పెంటపాడు : అలంపురం గ్రామంలో జగనన్న కాలనీలో రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ సౌకర్యం తక్షణమే కల్పించాలని భారత కమ్యూనిస్టు పార్టీ మండల సమితి డిమాండ్ చేసింది. గురువారం సీపీఐ పోరుబాట కార్యక్రమంలో భాగంగా పెంటపాడు మండలం అలంపురం గ్రామంలో జగనన్న కాలనీ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, బి.లక్ష్మీనారాయణ, మర్లపూడి కాటమరాజు, దిద్దె నాగేశ్వరరావు ప్రతినిధి బృందం పరిశీలించింది.

సీపీఐ సంతకాల సేకరణ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఆంధ్ర రాష్ట్రంలో ప్రభుత్వం ద్వారా గృహాలు నిర్మించుకునే జగనన్న కాలనీల లబ్ధిదారులకు రూ.5 లక్షలు మంజూరు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం మంగపతి దేవి పేట గ్రామంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ నిరుపేదలకు ఇచ్చే ఇల్లు ఇళ్ల స్థలాలు నిర్మాణానికి రూ. 1లక్షా 80 వేలు సరిపోవడం లేదని, రూ. 5 లక్షలు లబ్ధిదారులకు అందజేయాలని శ్రీనివాసరావు కోరారు. కొయ్యలగూడెం మండలంలో ఇల్లు లేని నిరుపేద ప్రజలకు ప్రభుత్వం ద్వారా ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం, ప్రక్రియ త్వరగా చేపట్టాలని, ఇళ్ల స్థలాలు లేని లబ్ధిదారులకు స్థలాలు కొనుగోలు చేసి పట్టాలు పంపిణీచేసి లబ్ధిదారులకు స్థలాలు అందజేయాలని శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పాస్‌పోర్టు పోయినది

కుర్మాల నాగ సుబ్రహ్మణ్యం, తండ్రి వెంకట సుబ్బారావు, చానమిల్లి గ్రామం, నిడమర్రు మండలం, ఏలూరు జిల్లా అను నేను నా యొక్క పాస్ పోర్టు నెంబర్: **K2277649** గల పాస్‌పోర్టు **డి.10-1- 2023 తేదీన** చానమిల్లి గ్రామం నుండి గణపవరం జిరాక్స్ నిమిత్తం వస్తుండగా మార్గమధ్యలో పాస్‌పోర్టు పడిపోయినది. ఎవరికైనా దొరికితే నా అడ్రస్‌కు తెలియజేయగలరు .

కుర్మాల నాగ సుబ్రహ్మణ్యం,
తండ్రి వెంకట సుబ్బారావు, చానమల్లి గ్రామం
నిడమర్రు మండలం, ఏలూరు జిల్లా
సెల్ నెంబర్: 9948141751

బూర్గంపాడు రహదారి పనులు పూర్తి చేయాలి

- పోలవరం ప్రాజెక్టు ముంపు నిర్వాసితులకు న్యాయం చేయండి
- గ్రామ సచివాలయాలలో రెండో రోజు సీపీఐ వినతి పత్రాలు

విశాలాంధ్ర - కుక్కునూరు : మోకాళ్ళ లోతు గోతులతో పాదచారులు నడవలేని స్థితిలో,నిత్యం పలు ప్రమాదాలకు నిలయమైన బూర్గం పాడు అశ్వారావుపేట అంతరాష్ట్ర రహదారి పనులు పూర్తి చేయాలని, పోలవరం ప్రాజెక్టు ముంపు నిర్వాసితులకు న్యాయం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ కుక్కునూరు మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం పలు సచివాలయాలలో వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా సిపిఐ కుక్కునూరు మండల సహాయ కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య, మాజీ జడ్పీటీసీ సిపిఐ జిల్లా సమితి సభ్యురాలు వరకా శ్యామల మాట్లాడుతూ కుక్కునూరు మండలం లో ఖాళీగా ఉన్న విఆర్ఓ పోస్టులు భర్తీ చేయాలని, ఆర్ అండ్ ఆర్ కాలనీలకు తరలించిన కుటుంబాలకు అక్కడే ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు మంజూరు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. 2006 సంవత్సరంలో ఎకరాకు రూ 115000 పరిహారం చెల్లించి సేకరించిన భూములకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్వాసితులకు యిచ్చిన హామీ మేరకు ఐదు లక్షల రూపాయలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.కుక్కునూరు అమరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీ ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు.

దర్శిపర్రులో జగనన్న కాలనీలు పునాదులకే పరిమితం

విశాలాంధ్ర- పెంటపాడు: జగనన్న కాలనీలు పునాదులకే పరిమితం అయ్యాయని సిపిఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు విమర్శించారు. సిపిఐ పోరుబాట కార్యక్రమంలో భాగంగా సిపిఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, బి లక్ష్మీనారాయణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ 36 స్థలాలకు మూడు స్లాబులకు పరిమితమై, 31కి పైగా బేస్మెంట్ వేసి ఆపేశారని ఆరోపించారు. జగనన్న కాలనీ నిర్మానుష్యంగా ఉందన్నారు. ప్రభుత్వం కేటాయించిన రూ.1లక్ష 80వేలు మెరకకు, బేస్మెంట్ కి సరిపోతాయని ఆ స్థలాన్ని బట్టి అర్థమవుతుందని తెలిపారు. ప్రభుత్వం మానవత్వం ఆలోచించి పునాదులకు పరిమితమైన జగనన్న కాలనీకు రూ.5 లక్షలు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అటవీ బంజరు భూములు పేదలకు పంచాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం: అటవీ బంజరు భూములు ప్రభుత్వం పేదలకు పంపిణీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి సాకా గంగరాజు డిమాండ్ చేసారు. స్థానిక గండిమెట్ట వద్ద సీపీఐ బందంచర్ల శాఖ సమావేశం వీరంకి వెంకట్రావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండిమెట్ట, బందంచర్ల గ్రామాల్లోని అటవీ బంజరు భూములను పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వం వన సంరక్షణ సమితులను ఏర్పాటు చేసి భూమి లేని పేదలకు కుటుంబానికి హెక్టారు చొప్పున భూపంపిణీ చేయాలన్నారు. దున్నేవానిదే భూమి నినాదంతో లక్షలాది ఎకరాల భూమిని పంచిన ఘనత సీపీఐదన్నారు. జగనన్న కాలనీలలో గ్రామీణ ప్రాంతాల్లో 3 సంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు భూమి ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు భూమి దక్కే వరకు పేదల పక్షాన సీపీఐ అలుపెరగని పోరాటం చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడిగడప జయరాజు, అడ్వకేట్ ఎం. రాజ్ కుమార్, తాణంకి కొండయ్య, శౌరి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో సీఎం విఫలం

విశాలాంధ్ర - కామవరపుకోట : 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో నేటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు, ఇల్లు నిర్మిస్తామని ఇచ్చిన హామీలు అమల్లో పూర్తిగా విఫలమయ్యారని సీపీఐ కామవరపుకోట మండల కార్యదర్శి టీవీఎస్ రాజు అన్నారు. గురువారం కామవరపుకోట ముఠా వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద సిపిఐ పోరుబాట గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కోడిగంటి సోమరాజు అధ్యక్షతన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న కాలనీలకు ఇళ్ల స్థలాలు పట్టాలు పొందిన లబ్ధిదారులందరూ సొంతింటి కల నిజం చేస్తామని అందరికీ ఇల్లునిర్మించి ఇస్తామని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్మించిన జగనన్న కాలనీలో భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు, ముసలి తల్లిదండ్రులు ఉండటానికి చాలక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఫిబ్రవరి 6న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ కార్యాలయం ధర్నాలు చేయడం జరుగుతుందని అందులో భాగంగానే ఫిబ్రవరి 6న ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలు పేదలు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు యానం శెట్టి గోపి, నల్లమతుల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

విశాలాంధ్ర - భీమవరం : గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు త్వరితగతిన పగడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరు క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గణతంత్ర దినోత్సవ కార్యక్రమం ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. వివిధ శాఖల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై శకటాలు, స్టాల్స్ ఏర్పాట్లను సంబంధిత అధికారులు సమన్వయంతో తరగతిన పూర్తి చేయాలన్నారు. వేదిక, భారికేడింగ్ ఏర్పాట్లను ఆర్ అండ్ బి అధికారులు, త్రాగునీరు ఆర్‌డబ్ల్యూఎస్, శానిటేషన్ ఏర్పాట్లను మున్సిపల్ శాఖ చేపట్టాలన్నారు. స్టాల్స్ ఏర్పాటులో అన్ని శాఖలు సమయంతో పనిచేసి కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఈ సందర్భంగా అధికారులను కోరారు.జిల్లా జాయింటు కలెక్టరు మురళి మాట్లాడుతూ వివిధ శాఖలకు అప్పచెప్పిన విధులు సక్రమంగా నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమం నిర్వహణలో ఎక్కడ ఏటువంటి లోటుపాట్లు రాకుండా అన్ని పగడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. గ్రౌండ్ ప్రిపరేషన్ ముందుగానే చేయాలని, బారికేడ్లు ఏర్పాటు పూర్తి చేయాలని జిల్లా జాయింటు కలెక్టరు జేవీ మురళి సూచించారు. సమావేశంలో డిఆర్ఓ దాసిరాజు, అన్నిశాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

- హోప్ సంస్థ పేరుతో సహాయం
- రూ. 4.50 లక్షల నగదును అందించిన గురువు ఆదాం

విశాలాంధ్ర - లింగపాలెం : ధర్మాజీగూడెంనకు చెందిన ప్రవాసాంధ్రుడు, జర్మనీ దేశంలో ఆర్‌సీఎం సంస్థలో గురువుగా విధులు నిర్వర్తిస్తున్న సొంగా ఆదాం హోప్ స్వచ్ఛంద సంస్థను నెలకొల్పి పేద విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని అందించారు. ధర్మాజీగూడెంలో ఆర్‌సీఎం చర్చి ఆవరణలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఈయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ పేదరికం, అసమానతలు పోవాలంటే చదువుకోవటం ప్రధానమని అన్నారు. అనాధలు, తల్లిదండ్రులను కోల్పోయి చదువుతున్న 85 మంది విద్యార్థులకు రూ. 5 వేలు చొప్పున రూ. 4.25 లక్షల నగదును ఈయన అందించారు. ధర్మాజీగూడెం, మఠంగూడెం, కొణిజర్ల, మఠంగూడెం, సుందరరాజుపేట, భోగోలు, కలరాయనగూడెం, అయ్యపరాజుగూడెంలోని పేద, అనాధ విద్యార్థులను గుర్తించి ఈయన ఆర్థిక సాయం అందించారు. తాను స్థాపించిన హోప్ సంస్థ ద్వారా పేదలకు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహి స్తానని ప్రకటించారు. ధర్మాజీగూడెంలోని ఆర్‌సీఎం చర్చి ఆవరణలో పుణ్య క్షేత్రాన్ని నెలకొల్పేందుకు గతంలోనే అధిక మొత్తంలో విరాళాన్ని ప్రకటించారు. ఈ పుణ్యక్షేత్రం ద్వారా పేదలకు చేయూతనివ్వాలనేది తన ఆశయమని అన్నారు. కార్యక్రమంలో స్థానిక విచారణ గురువు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో జంగిల్ క్లియరెన్స్ పనులు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామ పంచాయతీ 3వ వార్డులో చెరువు గట్టు ఏరియా, అన్ని వీధులలో గురువారం జంగిల్ క్లియరెన్స్ పనులు చేశారు. శానిటేషన్ పనులు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి కాకర్ల వెంకట గిరిధర్, గ్రామ సర్పంచ్ బండారు సింధు మధుబాబు, ఉపసర్పంచి పాతూరి జగదీష్, ఆయా వార్డు నెంబర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యదర్శులు పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉంగుటూరు ఈఓపీఆర్డీ షేక్ షంషీద్దీన్ అన్నారు. గురువారం ఆయన ఉంగుటూరు పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామాలలో పారిశుధ్యంతో పాటు సూపర్ శానిటేషన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కాకర్ల వెంకట గిరిధర్ పాల్గొన్నారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసులు

విశాలాంధ్ర - లింగపాలెం : టీసీహెచ్‌ఆర్‌పాలెంలో కోడి పందేలపై దాడి చేసేందుకు వెళ్ళిన పోలీసులను అడ్డగించిన వారిపై ధర్మాజీగూడెం పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈనెల 15వ తేదీ రాత్రి గ్రామంలో పందేలు వేస్తుండగా దాడి చేసేందుకు వెళ్ళిన పోలీసులపై పలువురు స్థానికులు ఎదురు తిరిగారు. దీంతో పట్టుకున్న వారిని వదిలివేసి పోలీసులు వచ్చేశారు. అనంతరం యధేచ్ఛగా పందేలు నిర్వహించారు. ఈ సంఘటనను విశాలాంధ్ర 17వ తేదీన వెలుగులోకి తెచ్చింది. గ్రామంలో జరిగిన పరిణామాలను పోలీసులు ఛాలెంజ్‌గా తీసుకున్నారు. తమ విధులకు ఆటంకం కలిగించారని ముగ్గురిపై వివిధ సెక్షన్లతో కేసులు నమోదు చేశారు. కోడి పందేలలో పోలీసులకు పట్టుబడిన ముగ్గురిపై కూడా కేసులు నమోదు చేశారు. పోలీసులు నమోదు చేసిన కేసులో గ్రామానికి చెందిన మండల స్థాయి ప్రముఖ వైసీపీ నాయకుని పేరు ఉంది. దీనిపై అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. ఈ నాయకుని పేరు కేసులో ఉండటం చర్చనీయాంశమైంది.

నిర్వాసితుల పక్షాన రెండవ రోజు సీపీఐ ధర్నా

విశాలాంధ్ర - వేలేరుపాడు : విలీన మండలాల్లోని పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రెండవ రోజు భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.పలు నిర్వాసిత సమస్యలు పరిష్కరించాలని తెలుపుతూ రుద్రంకోట, రేపాకగొమ్ము, తాట్కూరుగొమ్ము సచివాలయాల ముందు గురువారం నిరసన వ్యక్తం చేసి అనంతరం ఆయా కార్యాలయాల్లో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వలన విలీన మండలాల్లో వేల కుటుంబాలు ముంపునకు గురవుతున్నా ప్రభుత్వానికి పట్టనట్లుగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఆధారాలున్న ప్రతి కుటుంబానికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వాలు మారిన నిర్వాసితులకు ఒరిగిందేమి లేదన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాడిశ రాము, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కారం దారయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, జిల్లా కౌన్సిల్ సభ్యులు సోడే రమాదేవి, కురిమేళ్ళ వెంకటేశ్వర్లు, కరటం వెంకటేశ్వర్లు, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ఎర్ర మధు, మహిళా సమాఖ్య నాయకులు సోడే రమాదేవి, పిట్టా సాయమ్మ, శాఖా కార్యదర్శులు కారం భోజ్జి, కట్టి గోపాలరావు, బంధం నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ చందన ఉమాకు మాతృ వియోగం



విశాలాంధ్ర - కలిదిండి: మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చందన ఉమామహేశ్వర రావు తల్లి భారతి (70) బుధవారం రాత్రి మృతి చెందారు. గురువారం మండలంలోని కోరుకొల్లు గ్రామంలో ఉమా నివాసం వద్ద ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు భారతి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. జెడ్పీటీసీ బొర్రా సత్యవతి, మండవల్లి ఎంపీపీ పెద్దిరెడ్డి రామ దుర్గాప్రసాద్, నంబూరి. శ్రీదేవి మండవల్లి, కలిదిండి మాజీ ఏఎంసీ చైర్మన్ లు గుమ్మడి వెంకటేశ్వరరావు, నీలపాల వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, వైస్ ఎంపీపీ కట్ట నాగలక్ష్మి దూలం ఆది వినయ్, పలువురు సర్పంచులు, గ్రామ ప్రముఖులు ఉమాను పరామర్శించారు. భారతి అంతిమయాత్రలో దూలం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేమన శతకాలు కీర్తిని పొందాయి

విశాలాంధ్ర - గణపవరం: తెలుగు కవి యోగి వేమన రచించిన శతకాలు, పద్యాలు సామాన్య ప్రజలకు కూడా అర్థమయ్యే భాషలో చెప్పి ప్రజల్ని మెప్పించి ఆ రచనలు కీర్తిని తెచ్చిపెట్టాయని పుర ప్రముఖులు పిప్పర గ్రామానికి చెందిన ఇందుకూరి వెంకట నరసింహారాజు(ఐవి రాజు) అన్నారు. గురువారం గణపవరం మండలం పిప్పర శాఖా గ్రంథాలయంలో శ్రీ యోగివేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యోగివేమన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. శాఖ గ్రంథాలయానికి పిప్పర గ్రామానికి చెందిన గుడ్ల సీతారాం (యూఎస్ఏ) ఆయన తల్లితండ్రులు పేరున గ్రంథాలయానికి రూ 10 వేలు శాశ్వత విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది గుడ్ల వెంకటకృష్ణారావు, పమ్మి సత్యనారాయణమూర్తి, గ్రంథాలయ అధికారి పి. రంగారావు, పాఠకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పింఛనుదారులు ఫిబ్రవరి 28 లోపు వార్షిక ధృవీకరణ పత్రాలు సమర్పించాలి

విశాలాంధ్ర - ఏలూరు : ట్రెజరీ కార్యాలయాల ద్వారా సర్వీస్ పెన్షన్, కుటుంబ పెన్షన్ పొందుతున్న పింఛను దారులు అందరూ తప్పనిసరిగా జనవరి 1 నుండి ఫిబ్రవరి 28 వరకు వార్షిక ధృవీకరణ పత్రాలు జీవన్ ప్రమాన్ పోర్టల్ ద్వారా సమర్పించాలని ఏలూరు జిల్లా ఖజానా, లెక్కల శాఖాధికారి, టి. కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆ వార్షిక ధృవీకరణ పత్రాలు సమర్పణ కు తప్పనిసరిగా వారి పింఛను పొందుతున్న సబ్ ట్రెజరీ కార్యాలయానికే వెళ్ళ వలసిన అవసరం లేదని, వారికి దగ్గరగా ఉన్న ట్రెజరీ కార్యాలయాన్ని, మీ సేవా కేంద్రాలు, బ్యాంకులు,ఇతర సర్వీస్ సెంటర్లలో వేయవచ్చని, సొంతంగా బయోమెట్రిక్ డివైజ్‌లు కలిగిన వారు వారి ఫోన్, కంప్యూటర్ ద్వారా కూడా వేయవచ్చని తెలిపారు. ఎవరికైనా జీవన్ ప్రమాన్ పోర్టల్ లో నమోదు చేయడంలో ఇబ్బందులు ఉన్నా, అనారోగ్య కారణాల చేత బయటకు రాలేక పోయినా సంబంధిత ట్రెజరీ అధికారుల దృష్టికి తీసుకువెళితే వారు తగుచర్యలు తీసుకుంటారని తెలిపారు.ఈ విషయం లో జిల్లా నందలి సహాయ ఖజానా అధికారులు, ఉప ఖజానా అధికారులందరికి శనివారం సమావేశం నిర్వహించి తగు సూచనలు జారీ చేశారు.

మాంటిస్సోరి పాఠశాలలో వార్షిక క్రీడోత్సవాలు

విశాలాంధ్ర- తణుకు : స్థానిక మాంటిస్సోరి స్కూలులో గురువారం 34వ వార్షిక క్రీడోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు పాఠశాల పతాకావిష్కరణ గావించి జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఈ క్రీడల్లో పాల్గొని గెలుపు ఓటములను సమదృష్టితో స్వీకరించాలన్నారు. నేటి ఓటమి రేపటి విజయానికి తొలిమెట్టు అని అన్నారు. క్రీడల వలన విద్యార్థులలో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం, చక్కని ఆరోగ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానఉపాధ్యాయిని ఎం. లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కైకరం హైస్కూలును సందర్శించిన ఉప విద్యాశాఖ అధికారి

విశాలాంధ్ర-ఉంగుటూరు: కైకరం హైస్కూలను తాడేపల్లిగూడెం డివిజన్ ఉపవిద్యాశాఖా అధికారిణి ఎన్. రవీంద్ర భారతి గురువారం సందర్శించారు. పాఠశాలలో పరీక్షల సందర్భంగా దిద్దిన జవాబు పత్రాలను సబ్జెక్టుల వారీగా పరిశీలించి, తగు సూచనలు చేశారు. ఎస్ఎ -1 పరీక్షలలో తరగతి ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. 6 నుంచి పదవ తరగతి వరకూ వెనుక బడిన విద్యార్థులకు రెమిడీయల్ తరగతులు నిర్వహించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని హెచ్ఎం శ్రీనివాస్ కుమార్ తెలిపారు.

యోగి వేమన జయంతి వేడుకలు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం ఉప్పాక పాడులో యోగి వేమన జయంతి ప్రధానోపాధ్యాయులు అల్లు శ్రీను ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. తొలుత వేమన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అల్లు శ్రీను మాట్లాడుతూ మనం యోగి వేమన రచించిన పద్యాలు సమాజానికి ఆదర్శం, అనుసరించదగినవి అని చెప్పారు. ఉపాధ్యాయులు పి.శ్రీదేవి, శాంసన్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల చేత వేమన పద్యాలు చెప్పించారు.

యోగి వేమన జయంతి వేడుకలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : స్థానిక శాఖగ్రంథాలయం వద్ద యోగివేమన జయంతిని విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. ముందుగా యోగి వేమన చిత్రపటానికి గ్రంథ పాలకు రాలు యు. రాముడు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వేమన రచించిన తెలుగు పద్యాల విశిష్టతను ,ఆయన నిరాడంబరతను విద్యార్థులకు రాముడు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - గణపవరం : ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఉంగుటూరు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జి పచ్చమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం గణపవరం మండలం డి కుముదువల్లి గ్రామంలో 10 వరోజు జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించి, పెద్దలను కలిసి ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.డి కుముదువల్లి గ్రామంలో ప్రజలు త్రాగునీరు, డ్రైనేజీ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వివరించారు. ప్రజాసమస్యలు పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి గంగుమొలు చిన్న రత్తయ్య, గ్రామ అధ్యక్షులు బండి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నార్ల పెద్ద సత్యం, దాసం సూర్య ధనరాజు,తోట పవన్, దాసం వెంకట కుమార్, దశం రాము, ముద్రగడ్డ పాపయ్య,వడ్డీ వెంకట్, యాలబండి సాయి, కొల్లేపల్లి దుర్గాప్రసాద్, కాసాని నరసింహమూర్తి, గ్రామ జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం అమ్మకాలను సమీప మిల్లర్లకు ఇవ్వాలి

విశాలాంధ్ర- నూజివీడు టౌన్ : మండల పరిధిలో రైతాంగం తమ ధాన్యాన్ని అమ్ముకునేందుకు సమీప మిల్లర్లకు అమ్ముకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని నూజివీడు ఎంపీపీ ఆరేపల్లి శిరీష సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నూజివీడు మండలం పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ అన్ని శాఖల అధికారులు తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో రైతాంగం తమ ధాన్యాన్ని అమ్ముకునేందుకు సమీప మిల్లర్లకు అవకాశం ఇవ్వాలన్నారు. సుదీర ప్రాంతాలకు తీసుకుని వెళ్లి అమ్మాలంటే చిన్న, సన్నగా రైతులకు వ్యయ ప్రయాసవుతుందన్నారు. కాబట్టి ఉన్నతాధికారులు ఈ సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించలన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు మంజూరైన ట్రాన్స్ఫర్లను బిగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ జి. కృష్ణంరాజు , వైస్ ఎంపీపీ దండి బోయిన స్వర్ణలత, ఎంపీడీవో ఎంపిఎస్ సుందరి , సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వేమన పద్యాలు జీవిత సత్యాలు

విశాలాంధ్ర - భీమవరం : వేమన పద్యాలు జీవిత సత్యాలు అని,సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో అత్యంత సులభంగా తేలికైన పదజాలంతో రచించిన వేమన పద్యాలు అన్ని తరాల ప్రజలు అంగీకరించడం ఆయన రచనల గొప్పతనం అని జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి అన్నారు .గురువారం జిల్లా కలెక్టరు క్యాంపు కార్యాలయంలో యోగివేమన జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యోగివేమన చిత్రపటానికి ముందుగా పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆటవెలది చందంలోనే పద్యాలను రచించి లోతైన భావాన్ని కూడా సరళమైన భాషలో చక్కటి ఉదాహరణలతో హృదయానికి అత్తుకునేలా వేమన తన భావాన్ని ప్రజలకు చెప్పారని ఆమె కీర్తించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యోగి వేమన జయంతి వేడుకలను నిర్వహిచడం జరుగుతుందని జిల్లా కలెక్టరు అన్నారు. ఎప్పుడు ఈ కార్యక్రమం నిర్వహించిన వేదికపై ఉన్నవారు మాట్లాడితే ఎదురుగా ఉన్నవారు అందరూ ప్రేక్షకులుగా మాత్రమే ఉండేవారని కాని ఈ జయంతి ఉత్సవ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు అయ్యారన్నారు. వేమన విగ్రహారాధనకు, కులాలకు, మతాలకు అతీతమని అయన అన్ని వర్గాలకు చెందిన వ్యక్తి అని ఆమె కొనియాడారు. ఆయన పద్యాలతో జీవిత సత్యాలను ప్రజలకు తెలియజేశారని, తెలుగు భాష గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని ఆమె కీర్తించారు. ఆయన రచించిన ఎన్నో పద్యాలు నేటి ఆధునిక యుగంలో చేపడుతున్న పరిశోధనలకు ఆధారంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లా జాయింటు కలెక్టరు జెవి మురళి మాట్లాడుతూ యోగివేమన ప్రజాకవి అని, పామరులు , పండితులను అలరించిన ఆయన కవిత్వం ఎంతో గొప్పదని ఆయన అన్నారు. యోగి వేమన జన్మదిన వేడుకల్లో , జిల్లా రెవెన్యూ అధికారి దాసిరాజు , జిల్లా విద్యాశాఖ శాఖ అధికారి ఆర్. వెంకట రమణ, జిల్లా బి సి సంక్షేమ శాఖ అధికారి గణపతి రావు , జిల్లా అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాలు లీజు

విశాలాంధ్ర -భీమవరం: విజయవాడ జోన్ పరిధిలో ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్వరాలను 15 ఏళ్ల లీజు ప్రాతిపదికన ఇవ్వడానికి ఫ్రీబిడ్ ఆహ్వానిస్తున్నట్లు పశ్చిమగోదావరి జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎ.వీరయ్యచౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. తునిలో 2, కాకినాడలో 1, పెద్దాపురంలో 1, సామర్లకోటలో1, అంబాజీపేటలో1, రంగంపేటలో1, ద్వారకాతిరుమలలో 1, ఏలూరులో 3, తాడేపల్లిగూడెంలో 2, మార్టేరులో 2, చల్లపల్లిలో 3, కూచిపూడిలో 1, మోపిదేవిలో 1, మచిలీపట్నంలో 1, మైలవరం లో 1, నందిగామలో 2, జగ్గంపేటలో 4 ఖాళీ స్థలాలు ఉన్నాయని వీటికి సంబంధించి శుక్రవారం విజయవాడ ఆర్టీసీ హౌస్, పిఎస్బిఎస్ వద్ద మధ్యాహ్నం 3 గం"లకు ఫ్రీబిడ్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు ఆసక్తి కలిగిన వారు కాన్ఫరెన్స్ లో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పాలడుగుకు ఘన నివాళులు

విశాలాంధ్ర - నూజివీడు టౌన్ : మాజీమంత్రి ,కాంగ్రెస్ పార్టీ దివంగత నాయకులు పాలడుగు వెంకటరావు 8వ వర్ధంతి పురస్కరించుకుని స్థానిక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నాయకులు గురువారం సంతాప సభ నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు, పాలడుగు సేవలను కొనియాడారు . ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ బీడీ రవికుమార్, మాజీ జెడ్పిటిసి సభ్యులు సుంకర సుభాష్ చంద్రబోస్, కాంగ్రెస్, పీసీసీ సభ్యులు విటల్, జిల్లా ఉపాధ్యక్షులు పరిమిసాగర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా గృహ నిర్మాణాలు

విశాలాంధ్ర -భీమవరం టౌన్: నియోజకవర్గంలో మొదటి విడతగా జరుగుతున్న గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో హౌసింగ్ డిఇ బి. వెంకటరమణతో ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగుతున్న గృహ నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో సుమారుగా 14 వేల మందికి పైగానే ఇళ్ల స్థలాలను మంజూరు చేసి, పట్టాలను కూడా ఇచ్చినట్టు తెలిపారు. ఒక్కో గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ.లక్ష 80 వేల నిధులను ఉచితంగా మంజూరు చేయడంతో పాటుగా లబ్ధిదారుల ఇష్టం మేరకు 30 వేల వరకు బ్యాంకు రుణాలను కూడా అందించడం జరుగుతుందని అన్నారు. కాలనీలలో అంతర్గత రోడ్లను కూడా నిర్మించనున్నట్టు తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. గృహ నిర్మాణాలపై రోజువారి పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోనున్నామన్నారు.

పరంపర స్కీమ్‌లో అక్రమాలు నిగ్గు తేల్చాలి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఆంధ్రప్రదేశ్ పేపర్ మిల్లులో పరంపర టు పేరుతో సాగుతున్న అక్రమాల నిగ్గు తేల్చాలని టీడీపీ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు డిమాండ్ చేసారు. పారదర్శకంగా జరగాల్సిన నియామకాలు అక్రమాలకు నిలయంగా మారడం శోచనీయమన్నారు. స్వేదం చిందించి పరిశ్రమ అభివృద్ధికి తోడ్పడే కార్మికులను మోసం చేయాలనుకోవడం, వారిచేత కన్నీళ్లు పెట్టించడం దారుణాతి దారుణమని అన్నారు. సాక్షాత్తు అధికార వైసిపి ఎమ్మెల్యే, తూర్పు గోదావరి జిల్లా వైసిపి అధ్యక్షుడు అయిన జక్కంపూడి రాజా ఇప్పటికే కార్మికులకు జరిగిన అన్యాయం గురించి కలెక్టర్ కి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. అటువంటి వ్యక్తిపై ఇంతవరకూ చర్యలు ఎందుకు తీసుకోలేదని ఆదిరెడ్డి వాసు ప్రశ్నించారు. మరోపక్క ప్రవీణ్ చౌదరిని వైసిపిలో చేర్చుకుని సీఎం కి తరచూ పరిచయం చేస్తున్న ఎంపీ భరత్ దీనికి ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. తెలుగు మహిళ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షురాలు ద్వారా పార్వతి సుందరి, టిడిపి రాజమండ్రి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు మజ్జి రాంబాబు, బీసీ సాధికార సమితి శెట్టిబలిజ విభాగం రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, టిఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి తీడా నరసింహారావు, రాజమండ్రి పార్లమెంట్ కమిటీ అధ్యక్షులు యర్రమోతు ధర్మరాజు, ప్రధాన కార్యదర్శి యాళ్ల శ్రీను, మాజీ కార్పొరేటర్లు కడలి రామకృష్ణ, పాలవలస వీరభద్రం, నాయకులు మిస్కా జోగినాయుడు, టిఎన్టియూసీ అధికార ప్రతినిధి మల్లెల శ్రీనివాస్, పేపరు మిల్లు టిఎన్టియూసీ నాయకులు ఎం సుబ్బారావు, చైతన్య కార్మిక సంఘం నాయకులు ఎల్ అప్పారావు, జిల్లా టిఎన్టియూసీ నాయకులు ఎన్. రమణారావు, పీవీ ప్రసాద్, లచ్చిరెడ్డి వాసు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు సాయి దీపక్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్య వెలుగు రేఖ యోగి వేమన

విశాలాంధ్ర - ఆలమూరు : విశ్వదాభిరామ వినురవేమ అనే మాట వినని తెలుగువారు ఉండరేమో. వానకు తడవని వారు, వేమన పద్యం రాని తెలుగువారు ఉండరని పామరులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలు

చెప్పి ప్రజలను మెప్పించిన కవి, మట్టిలో పుట్టి మహోన్నతమైన శిఖరాలను అందుకున్న మానవతామూర్తి యోగి వేమనని, ఆయన తెలుగు సాహిత్య వెలుగు రేఖగా కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం జొన్నాడ గ్రామ మాజీ సర్పంచ్ ద్వారంపూడి అప్పారెడ్డి అభివర్ణించారు. వేమన జయంతి సందర్భంగా జొన్నాడ మల్లేశ్వర స్వామి వారి ఆలయం వద్ద గల యోగి వేమన శిలా విగ్రహానికి వేమన రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ సమాజంలోని మంచి చెడుల్ని, జీవిత సత్యాలను వేమన తెలియజేశారని, మానవ జీవిత సత్యాఅసత్యాలను నిత్యాన్వేషణతో దర్శించి విమర్శించిన వివేకిగా వేమన కీర్తిగడించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లమిల్లి రామారెడ్డి, తాడి తమ్మిరెడ్డి, మేడపాటి రామారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తాడి శ్రీనివాస రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ నాద్ర నాగ మోహన్ రెడ్డి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ తాడి మెహెర్ ఆదిత్య రెడ్డి, తాడి వెంకన్నబాబు, తాడి శ్రీనివాస్ రెడ్డి(బట్టిశ్రీను), సర్పంచ్ కట్టా శ్రీనివాసు, మేడపాటి వెంకట కృష్ణారెడ్డి, మల్లిడి సుబ్బిరెడ్డి పలువురు పాల్గొన్నారు.

వరుణ్ తేజ్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - మండపేట : మెగా బ్రదర్ నాగబాబు తనయుడు, ప్రముఖ

సినీ హీరో వరుణ్ తేజ్ జన్మదిన వేడుకలు మండపేటలో ఘనంగా జరిగాయి. మండపేట వరుణ్ తేజ్ టౌన్ వైడ్ ఫాన్స్ అధ్యక్షుడు మోరం బాలాజీ ఆధ్వర్యంలో వరుణ్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం వరుణ్ తేజ్ 33వ జన్మదినోత్సవం పురస్కరించుకుని స్థానిక మయూరి వృద్ధాశ్రమంలో అల్పాహార విందు, పండ్లు పంపిణీ చేశారు. ఆశ్రమంలోని వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి వారికి పంచారు. కార్యక్రమానికి మెగా ఫ్యామిలీ పట్టణ అధ్యక్షుడు కొంతం నాగేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మెగా ఫ్యామిలీ అభిమానులు సేవా కార్యక్రమాల్లో ముందుంటా రన్నారు. బాలు మాట్లాడుతూ వరుణ్ మంచి భవిష్యత్ ఉన్న హీరో అన్నారు. కార్యక్రమంలో బందారు సతీష్, నరేంద్ర, రాజు,యాళ్ల సురేంద్ర, కొత్తపల్లి వీరతరుణ్, గ్రంధి సునీల్, శివ వరుణ్ అభిమానులు పాల్గొన్నారు.

సమాజానికి బుద్ధుని బోధనలు అవసరం

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి అతి సమీపంలో ఉన్న ప్రఖ్యాత బౌద్ధ క్షేత్రం పాడవుల మెట్ట ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. అమరావతి బుద్ధవిహార్ సౌజన్యంతో సద్దమ్మ దీపిక ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ బౌద్ధ బిక్షువు బంతే ధామ్నా ధజథేరో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను గురువారం రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే రాజా ఆవిష్కరించారు. ప్రతీ ఒక్కరూ సన్మార్గంలో నడిచి,సమాజ అభ్యున్నతికి తమవంతు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోమలి, తిలక్ కుమార్, రాజానగరం ఎంపీడీవో మూర్తి, శ్రీనివాస్, వైసీపీ నాయకులు కటకం బాబ్జీ, సద్దమ్మ దీపిక ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

విశ్వదాభిరామ వినురవేమ పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర - తాళ్లపూడి : వేమన పద్యాలు సమాజాన్ని నిర్దేశిస్తాయని, వాటిని నేర్చుకుని సన్మార్గంలో నడవాలని టీ టీ డి ధర్మ ప్రచారక్ పరస రాధాకృష్ణ తెలిపారు. గురువారం యోగి వేమన జయంతి కార్యక్రమాన్ని శ్రీ విజేత హై స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు డా.జొన్న కూటి ప్రమోద్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

కార్యక్రమంలో ముందుగా పాఠశాల విద్యార్థులు వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. విద్యార్థులకు వేమన పద్యాల పోటీ నిర్వహించగా జూనియర్స్ విభాగం నుండి జె నాగ మనోజ్ఞ, సీనియర్స్ విభాగం నుండి ఎన్ సురేఖ ప్రథమ స్థానంలో నిలిచారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు డా జొన్నకూటి రచించిన "విశ్వదాభిరామ వినురవేమ" పుస్తకాన్ని పరస రాధాకృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాత్రికేయులు ఎస్ గోపాల కృష్ణ, కె శ్రీనివాస్, ఉపాధ్యాయలు అనిత, కరుణ, దివ్య తదితరులు పాల్గొన్నారు.

జీ తెలుగులో సరికొత్త కథాంశంతో 'శుభస్య శీఘ్రం'

విశాలాంధ్ర- భీమవరం : ఎప్పటికప్పుడు సరికొత్త కంటెంట్‌తో భిన్నమైన సీరియల్స్‌తో తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న 'జీ తెలుగు'. ఛానల్ కొత్తదనం నిండిన కామెడీ, డాన్స్, సింగింగ్ షోలు, ఆసక్తికర మలుపులతో సాగుతున్న సీరియల్స్ టెలివిజన్ రంగంలో దూసుకుపోతోందని ఆ ఛానల్ ప్రాంతీయ ప్రతినిధి చెప్పారు. అదే ఉత్సాహంతో నూతన సంవత్సర సంక్రాంతి కానుకగా ఇప్పుడు 'శుభస్య శీఘ్రం' అంటూ మరో కొత్త సీరియల్‌తో ప్రేక్షకుల ముందుకి రాబోతోందన్నారు. ఇది ఆర్థిక అసమానతలు, ఆత్మాభిమానం మధ్య జరిగే సంఘర్షణగా తెరకెక్కుతున్న ప్రేమకథ అన్నారు. మహేష్ బాబు- కృష్ణప్రియ ప్రధాన పాత్రలలో నటించిన 'శుభస్య శీఘ్రం' ఈ నెల 23 నుంచి ప్రతిరోజూ రాత్రి 7 గంటలకు ప్రసారం కానుందని చెప్పారు.

ఫ్లిప్‌కార్ట్ రిపబ్లిక్ డే స్పెషల్

విశాలాంధ్ర-రాజమండ్రి: స్వదేశీ ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ డిజిటల్ బీ2బీ మార్కెట్ ప్లేస్ ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్ దాని సభ్యుల కోసం రిపబ్లిక్ డే స్పెషల్‌ను ప్రారంభించింది. 'మునాఫ్ కీ పెరేడ్' అనే థీమ్‌తో, ఆఫర్ వ్యవధిలో విస్తృతమైన ఉత్పత్తుల ఎంపికపై మునుపెన్నడూ చూడని డీల్‌లతో సభ్యుల లాభాలు, పొదుపులను పెంచాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈవెంట్ జనవరి 19 - 26, 2023 నుండి ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్ ఫిజికల్ స్టోర్‌లు, ఆన్‌లైన్ ఛానెల్‌లలో ప్రత్యక్ష ప్రసారమవుతుంది. అధిక లాభాలు, మరింత పొదుపులను అందించడంపై దృష్టి సారించి ఈ జాతీయ మెగా ఈవెంట్ వివిధ ఆకర్షణీయమైన ఆఫర్‌లు, డీల్‌లతో నిర్వహించబడిరది. ఇందులో '74 రిపబ్లిక్ డీల్స్', 'బ్రాండ్ బిల్ బస్టర్స్', మరిన్నింటిని వాక్-ఇన్, ఆన్‌లైన్ సభ్యుల కోసం ప్రత్యేకంగా రూపొందించినట్లు ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్ బిజినెస్ హెడ్ కోటేశ్వర్ ఎల్ ఎన్ తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన పడాల

విశాలాంధ్ర - అనపర్తి : ఇటీవల నూతనంగా నియమితులైన అనపర్తి మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి గురువారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్య నారాయణ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి నియామకానికి సహకరించిన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పడాల స్థానిక వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ సందర్శించారు. ల్యాబ్లో పరీక్షించబడుతున్న విత్తనాలు, ఎరువుల నమూనాల క్వాలిటీ పరీక్ష విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ ప్రదేశాల నుంచి వచ్చిన విత్తనాలు, ఎరువుల శాంపిల్స్ ఇక్కడ పరిశీలించి నివేదిక సమర్పిస్తామని వ్యవసాయ అధికారిని వాణి తెలిపారు. అనంతరం శ్రీనివాసరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా నియామకానికి కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి శ్రీ చైతన్య స్కూల్లో గురువారం స్కూల్ విద్యార్థులు సి 6బ్యాచ్ విద్యార్థులు ఆల్ ఇండియా స్థాయిలో జరిగిన కాట్ లెవెల్ సెకండ్ పరీక్షల్లో 11 మంది విద్యార్థులు స్వర్ణ పతకాలు సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ ఎ. సురేఖ తెలిపారు. ముగ్గురు విద్యార్థులు ఎన్. సాయిబాబా, కె. జశింత్, ఐ. సోనిత్ కు స్వర్ణ పతకాలతో పాటు నగదు బహుమతులు కూడా గెలుచుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను గురువారం పాఠశాలలో స్కూల్ ప్రిన్సిపాల్ ఎ. సురేఖ, ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, ఏవో భరత్, సత్యసాయి, ఉపాధ్యాయులు, అభినందించారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండి

విశాలాంధ్ర - అంబాజీపేట : కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని మండపేట ఇన్‌చార్జి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కామన ప్రభాకర్ రావు అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ములపర్తి మోహన్ రావు స్వగృహంలో గురువారం విలేకరుల సమావేశంలో ఏఐసీసీ నాయకులు మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు కామన ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఈదేశానికీ కాంగ్రెస్ పార్టీయే రక్షణ అని బీజేపీ ఈ దేశాన్ని కులాలుగా, మతాలుగా విభజించి ఫలించాలని అనుకొంటుందని ఇది దేశానికీ మంచిది కాదని అన్నారు. 137 సంవత్సరాలు చరిత్ర ఉన్న పార్టీ కాంగ్రెస్ అన్నారు. బీజేపీ, రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలో రైతులు, నిరుద్యోగులు, చిన్న వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ప్రజల కోసం పోరాడే ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు నెల్లి వెంకటరమణ, మాచవరపు శివన్నారాయణ, అమలాపురం ఇన్చార్జ్ అయితాబత్తుల సుభాషిని, సిహెచ్ జోగేశ్వరరావు, కోలా అర్జున్ రావు, అప్పల రామకృష్ణ, కొల్లి సరోజిని, గడ్డం వెంకటేశ్వరరావు, దిపాటి సత్తిబాబు, బాలయోగి తదితరులు పాల్గొన్నారు.

8వ డివిజన్‌లో గడపగడపకు ప్రభుత్వం

విశాలాంధ్ర - కాకినాడ : కౌడా చైర్ పర్సన్, వైయస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి గురువారం 8వ డివిజన్లో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. సాంబ మూర్తి నగర్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్ళి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడున్న రేళ్ళ ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి కుమార్, వైఎస్సార్‌సీపీ కాకినాడ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్నసాగర్, పలువురు మాజీ కార్పొరేటర్లు, అధికారులు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సత్వరమే పరిష్కరించాల్సిందిగా అక్కడే ఉన్న అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సహకారంతో కాకినాడ నగరాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెండ విష్ణుమూర్తి, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఎంహెచ్ఓ డాక్టర్ పృధ్వి చరణ్, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, కర్రీ శైలజ, చిట్నీడి నారాయణమూర్తి, వైఎస్ఆర్సిపి నాయకులు బళ్ళ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కేసీబీఎస్‌లో ఉచిత దంతవైద్య శిబిరం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ బిల్డింగ్ సొసైటీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం సంఘ ప్రధాన కార్యాలయంలో సభ్యులకు ఉచిత దంతవైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సంఘాధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

కార్యక్రమంలో తొలుత సంఘ పూర్వాధ్యక్షుడు దివంగత కోసూరి కృష్ణారావు, కోసూరి యదుసూర్య చిత్రపటాలకు పుష్పమాలవేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా కోసూరి మాట్లాడుతూ సంఘ సభ్యుల క్షేమమే సంక్షేమంగా భావిస్తూ పలురంగాల్లో నిష్ణాతులైన వైద్యులతో శిబిరాలను నిర్వహిస్తున్నామని, వాటిని వినియోగించుకోవాలని కోరారు. ఈ దంతవైద్య శిబిరంలో గుంటూరుకు చెందిన శ్రీధన్వి డెంటల్ క్లినిక్ వైద్యురాలు సీహెచ్ఎస్వీఎల్ స్రవంతి, కాకినాడ సమీక్ష దంతవైద్యశాల వైద్యుడు సువర్ణరాజు పాల్గొని దంతపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేశారు. కార్యక్రమంలో కేసీబీఎస్ ఉపాధ్యక్షుడు రెడ్డి వీరరాజేంద్రకుమార్, కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముమ్మిడి వెంకటరమణ, ముత్తా మధు, ఒబిలిశెట్టి బుచ్చిరాజు, శివబాలయోగి, కోసూరి లక్ష్మీప్రసాద లావణ్య, మేనేజర్ చీమలకొండ గంగాధరం తదితరులు పాల్గొన్నారు.